# మిస్టర్ లో (గో) కేశ్వర్రావ్ !

లోకేశ్వర్రావ్ మహాఘటికుడు. అతడిని అందరూ గో కేశ్వర్రావ్ అనేపిలుస్తారు. ఎ.పి.లో అతనిచేత గోకించుకోని వాడుండడు ! కాలక్రమేణా తన అసలు పేరును మరిచిపోయాడు పాపం!

ఎదుటివారిని గోకి ఎంతటి క్లిష్టమైన పన్లు అయినా సరే చేయంచుకోవటంలో దిట్ట!. అతనే నెంబర్‌వన్! అతని తరువాతే ఎవరైనా!

పని ఎంత చిన్నదైనా... పెద్దదైనా చిటికెలో చేయిస్తాడు. ఎంతటివారిని కలవటానికైనా అతను సంశయించడు... భయపడడు! అతని పరపతి అరచేతి మందానవుంది!

అసలు గోకించుకోవటంలో వున్న హాయి.... మజా... మందుకొట్టినప్పుడు కూడా వుండదు. అందమైన ఆడపిల్లను బుట్టలోవేసుకున్నా వుండదు!

గ్రీష్మంలో చెమట పొక్కులతో వీపంతా దురద పెడుతున్నప్పుడు తాళికట్టిన పెళ్ళాం చేత వీపు గోకించుకోవటంలో వున్న దానికంటే ఎక్కువ హాయిగ వుంటుంది.

'బాస్' ను ప్రసన్నుడిని చుసుకోవాలన్నా... దాజకీయనేతనో... మినిస్టర్ చేతనో పని చేయించుకోవాలన్నా... గోకుడు తప్పనిసరి! లోకేశ్వర్రావ్‌ది అతిపెద్ద సర్కిల్!. అందుకే అందరూ అతడినే గోకి అనేక రకాల పన్లు చేయించుకుంటూ వుంటారు.

వాళ్ల డాడీ మమ్మీని గోకగా గోకగా కల్గిన ఏకైక సంతానం లెకేశ్వర్రావ్. డాడీ పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే రోజుల్లో అనేకానేకమందిని గోకి ఎన్నో పనులు చేయించుకోవటం తప్పనిసరైంది.

తాత నుండి తండ్రికి... తండ్రి నుండి తనకు 'గోకుడు' వారసత్వ సంపదగ సంక్రమించింది లోకేశ్వర్రావ్‌కి.

రేషన్ కార్డ్ కోసం సివిల్ సప్లై ఆఫీసరును...వృద్ధాప్య పించన్ కోసం మండలాధికారినీ గోకాల్సిన రోజులివి! ఎవరిని గోక్కపోయినా ఏ పని అయిచావదు ఈ రోజుల్లో. ఈ సత్యం తెలీబట్టే గోకేశ్వర్రావ్ లాంటి మహానుభావులు అనేకులు సమాజంలో బతికేస్తుంటారు.

ఇలాంటి ఏబ్రాసి పన్లు చెయ్యడానికి... చదువుతో పన్లేదు. మంచితనం... లౌక్యం... తెలివి వుంటే చాలు... నెగ్గుకొస్తారు.

ఈ తెలివి తేటలన్నీ లోకేశ్వర్రావ్‌లో వున్నందునే మనిషి అనతికాలంలో ఎదిగి పాపులర్ అయ్యాడు. పాపం... ఇతగాడు కష్టపడో... కాపీలు కొట్టో... ఎట్లాగైతేనేం డిగ్రీ సంపాదించుకోవటం ఇతనికి గల ప్లస్ పాయింట్!

మినిస్టర్ అంకుల్‌ను గోకగా... గోకగా... విసుక్కుని చీదరించుకుని కాళ్లకు చుట్టుకున్న పాము కరవకమానదు సుమా అనుకున్నాడో ఏమో... సర్వీస్ కమీషన్ ఎగ్జామ్ పాస్ చేయించి మాంచి ఆదాయం వున్న డిపార్ట్‌మెంట్లో తీసుకెళ్లి పడేయించి ఆశీర్వదించాడు లో (గో) కేశ్వర్రావ్‌ను!.

గోకుడులోఅంతటి పవరుందిమరి!. వైకుంఠంలో వుండే శ్రీమహావిష్ణువు తనకు తీరిక దొరికినప్పుడల్లా అర్ధాంగి అయిన శ్రీమహాలక్ష్మితో గోకించుకోని క్షణం వుండదు. గోకించుకునేటప్పుడు తదాత్మ్యం చెంది కళ్లు రెండూ మూసుకుని యోగనిద్రలో వున్నట్టు అభినయిస్తాడు.

చతుర్ముఖుడైన బ్రహ్మగారికి తన మానసపుత్రుడైన నారదుడిచే అప్పుడప్పుడు గోకించుకోకపోతే కళ్లు మూతలుపడవ్... నిద్ర పట్టిచావదు. అడపా దడపా సరస్వతీదేవి కూడా గోకక తప్పదు.

పూర్వకాలంలో భార్య కాళ్లు వత్తుతుంటే భర్తగారు నిద్రలోకి జారిపోయేవారిని బామ్మలు నేటికీ చెప్తూవుంటారు. గోకుడులో అంతటి మజా వుంటుంది. ఈరోజుల్లో భర్తకు సేవలు చేయటానికి భార్యకు టైమెక్కడేడ్చింది? ఇరవైనాలుగు గంటలూ టి.వీ.లో మహిళా కార్యక్రమాలు చూడటంతోటే తెల్లారిపోతుంది!. తమకు సేవలు కట్టుకున్నవాడితో చేయించుకోకంటే అదేపదివేలు!. చెయ్యనన్నా... చెప్పినమాట వినకున్నా... పతిదేడుడి భరతం పట్టకమానదు. కాబట్టి భార్యా విధేయుడై వుండటమే శ్రేయస్కరం భర్త అనే మగాడు.

ఎలక్షన్లు వస్తున్నాయనగానే ఓట్ల కోసం ఓటర్లను గోకటం ప్రారంభిస్తారు బరిలోకి దిగిన అభ్యర్థులు! ఇది రొటీన్!. ఎన్నికల్లో గెలిచినవారు అధిష్టానాన్ని గోక్కపోతే పదవులు దక్కవేమోనే భయంతో హస్తినకు వెళ్లిరావటమో లేదూ అక్కడే బైఠాయించటమనేది సర్వసాధారణమైన విషయం (గోకటం కోసం).

X X X

ఉద్యోగం వచ్చింది లగాయతు... గోకేశ్వర్రావ్‌కు పెళ్లి సంబంధాల వేటలో పడి ఆడపిల్లల తండ్రులను గోకే ప్రయత్నం ముమ్మరం చేయసాగారు అతగాడి పేరెంట్స్!. గవర్నమెంట్ జాబ్ కావటాన... కట్నం మంచిరేటు పలుకుతుందనే ఆలోచనలో పడ్డారు!. పిల్ల ఎలా వున్నా... కట్నానికే ప్రాధాన్యం అను పేరెంట్స్ పిల్ల అందం ముఖ్యంగాని డౌరీ తక్కువైనా సరే ఫర్వాలేదని గోకేవ్వర్రావ్ వాదులాడుకుని... కడకు రెండు విషయాలకు ఈక్వల్ ఇంపార్టెన్స్ ఇచ్చేందుకై నిర్ణయించుకున్నారు. యాభై తులాల బంగారం.... మినిమమ్ ఐదులక్షల కట్నం తేగల సంబంధమైతే మంచిది.... భార్యభర్తను గోకుతూ ఒకరోజు రాత్రి తన మనసులో మాట వెళ్లగక్కింది.

వళ్లు జలగా వున్నా లేకున్నా... గోకించుకోవటానికి అలవాటుపడిన భర్త... చమ్మగ... హాయిగ వున్నందున సగం నిద్రలో సరేననేశాడు.

మ్యారేజ్ ఫిక్సయింఇ! లగ్గాలు పెట్టుకున్నారు. పిల్లమెడలో తాళి పడటానికి ముందే ఐదు లక్షల వ్యాషు... అదేనండీ... కట్నం!... రాబట్టుకున్నాడు పిల్లవాడి ఫాదర్. పెడతామన్న నగలన్నీ పెళ్ళికూతురు మెళ్లోదిగేశారో లేదోని ఒక్కొక్క ఆభరణాన్ని ఎంచి చూచుకుని ముఖం చాటంత చేసుకుంది పిల్లాడి మదర్!.

ఇంకేం? గోకేవ్వర్రావ్ జీలకర్ర బెల్లం పిల్లనెత్తిన గోడకు పిడక కొట్టినట్టు పెళ్లికూతురు నెత్తిన కొట్టి (సారీ పెట్టి) గభాల్న తాళికట్టి మహిని తనదాన్ని చేసుకుని గర్వంగ నవ్వుకున్నాడు.

వధూవరులకు మంగళహారతులిచ్చే సమయంలో ఆడపడుచు కట్నం ఘనంగ ఇవ్వాలంటూ అన్నను గోకుతుంది చెల్లెలు (ఇంటి ఆడపడుచు)!

ఇంతవరకూ కథ సాఫీగానే గడిచింది!

అసలు ప్రాబ్లమ్ శోభనం గదిలో మొదలైంది! మహి తాను ప్రభుత్వాసుపత్రిలో నర్స్ వుద్యోగం చేస్తున్నదని చెప్పగానే తోక తొక్కిన తాచయ్యాడు గోకేశ్వర్రావ్. గభాలున పందిరిమంచం దాగాడు. ఆ రాత్రి లంఖణమే. !

కోడలు ఇంట్లోకి అడుగుపెట్టగానే ఇంటి పెత్తనమంతా ఆమెకు అప్పగించి బెడ్‌రెస్ట్ తీసుకోవాలని కలలు కన్న అత్తగారి నెత్తిన పిడుగు పడ్డట్టయింది. మహి ఉ ద్యోగస్తురాలని తేలటంతో.

కుడికాలు పెట్టి అత్తారింట్లో అడుగుపెట్టినా... కథ అడ్డం తిరిగించది.

'సారీ ఆంటీ!... నేను పనిమనిషిని వంటమనిషినీ కాలేను. జాబ్ చేసే నాకు తీరికెక్కడుంటుందీ?' అనేసి కుండబద్దలు కొట్టింది మహి.

ఆమాట విన్న అత్తగారికి నోరు పడిపోయింది. పక్షవాతం (నోటికి) వచ్చినట్టన్పించింది. కొత్త కోడలినేమైన అంటే బాగుండదని నోరు నొక్కేసుకుంది.

'అయిదులక్షలు కట్నమిచ్చి మీ అబ్బాయిని కొనుక్కున్నదాన్ని. భర్తతో సమనంగ ప్రబుత్వోద్యోగం చేస్తున్నదాన్ని.. యాభై తులాల బంగారునగలు దిగేసుకున్ని పుట్టింటిని ఎడం కాలితో తన్ని... కుడికాలు అత్తవాంట పెట్టిన దాన్ని... నాకు ఎలాంటి పన్లూ చెప్పకండి. పనిమనిషిని వంటమనిషిని మాట్లాడండి!. అలిసిపోయి ఇంటకొచ్చాక అరకప్పు కాఫీ అందిస్తే తాగి రిలాక్స్ అవాలని నాకూ వుంటుంది. ఇంట్లో పనితో కష్టపడలేను...' మహి క్లాసు పీకింది.

'అవునూ... నువ్వు వుద్యోగం వెలగబెడుతున్నట్టు ముందుగా మాతో మాటమాత్రమైనా అన్లేదేం కోడలా?-' గుడ్లెర్రచేసింది అత్త.

'ఏం చెప్పకపోతే? అదేమైనా నేరమా?... భార్యాభరర్తలం ఇద్దరం ఉద్యోగం చేయటం మంచిదిగా!... నాలుగు చేతులా ఆర్జిస్తుంటే మనకెలాంటి ఆర్థికపరమైన ఇబ్బందులూ వుండవ్ కదా...' ఎదురుమాట్లాడింది. అత్త మీద ఫైరైంది.

'మీరు మాట్లాడకండి!. నా నిర్ణయాలను కాలరాచే హక్కు మీకేకాదు ఎవ్వరికీ లేదు...' భర్తనోటికి ప్లాస్టర్ వేసింది.

'అట్లా... పేషెంట్‌కి ఇంజక్షన్ ఇచ్చినట్టు బాదకలిగేట్టు మాట్లాడకు మహీ!. ఉద్యోగం.. సంసారం... డబుల్ రోల్ నువ్ పోషించటం కష్టం!...' నచ్చచెప్పబోయాడు.

'మధ్యలో మీరు దూరకండి!. అంతకావాలనుకుంటే మీరు ఉద్యోగం మానేసి ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటానో... వూళ్లోవారిని గోకి వుద్ధరిస్తూనో వుండిపోండి!...' మహిలో టెంపరేచర్ రెయిజైంది.

ఏమిటీ వితండవాదం అన్పించింది గోకేశ్వర్రావ్‌కి! ఎందరినో గోకి సులువుగ ఎలాంటి క్లిష్టమైన పనైనా చేయించుకోగలిగిన తాను... అఫ్ట్రాల్ పెళ్లాం చేత ఉద్యోగం మాన్పించలేక... నోరు మూయించలేకపోవటంతో షేమ్ ఫీలైనాడు.

పెళ్లాన్ని మేజ్ చెయ్యటం చేతగాని వాజమ్మా తను?... దద్దమ్మా...?.. నో!

నాటెటాల్.. తనకుతాను ధైర్యం చెప్పుకున్నాడు గోకేశ్వర్రావ్.

ప్రస్తుతానికి సంక్షోభం సద్దుమణిగింది! ఉవనిసపిలె వారుండిపోయారు.

X X X

'నేను మరో మదర్ థెరిసా కావాలని కలలు కంటున్నాను. నా జీవితాన్ని రోగుల సేవకే అంకితం చేయాలని ఆరాటపడుతున్నాను. అందుకే నర్స్ జాబ్ ఎంచుకున్నను...' మనసులోని చిరకాల వాంఛను బర్తకు చెప్పింది మహి.

'హ! నర్సేంఖర్మ? డాక్టరే కాలేకపోయావా?' ఎద్దేవా చేశాడు గోకేశ్వర్రావ్.

'డాక్టర్ కంటే నర్స్ వృత్తి ఎంతో పవిత్రమైనది. ఆదర్శవంతమైనది. రోగులకు సేవ చేయటంలో వుంటే తృప్తి మరెందులోనూ కన్పించదు. నామటుకు నాకు...'

'అలాంటప్పుడు పెళ్లెందుకు చేసుకున్నట్టో?-' వెటకారం ధ్వనించేట్టు మాట్లాడేడు.

'బుద్ధి గడ్డితిని పెళ్లి చేసుకోవలసి వచ్చింది. అందునా... మీవంటి సంకుచిత స్వభావం వలవ్యక్తి నా జీవిత భాగస్వామి కావటం... నా దురదృష్టం...' బాధ ద్యోతకమైంది మహి సమాధానంలో.

వివాహమై ఆరునెలలు కావస్తున్నా... తను... మమిని దగ్గరకు తీసుకోవటానికి మనస్కరించటం లేదు. మహిని ఎంతగానో ప్రేమిస్తున్నాడు... కానీ ... ఆమె చేసే నర్స్ వుద్యోగాన్ని అసహ్యించుకుంటున్నాడు. అంతేకాదు వుద్యోగం చేసేపిల్ల తన భార్యగా రావాలని తానేనాడూ కోరుకోలేదు.

'నర్స్' వుద్యోగమంటే... డ్యూటీ అంతా రోగుల మధ్యనే గడపాలి!. రకరకాల రోగాలతో బాధపడేవారికి తన భార్య సేవ చేయటామా?- నాన్సెన్స్!. మరి... పతిసేవ మాట ఏమిటి?- అలసిసొలసి ఇంటికొచ్చి నిద్రకుపక్రమిస్తుంది. తనగోడు వినేదెప్పుడు? తన చేత గోకించుకోవటానికి అసలు తీరిక అనేది వుంటుందా?- రోగులకు సేవ చేసి తాను పడుతుంది లేదా తనను రోగిష్ఠివాడిగ తయారుచేస్తుంది. ఇట్లా అయితే తన నోట్లో నాక్కింద థర్మామీటరే!. నిత్యం తనకు బి.పి. చెకప్పే! మందు బిళ్ళలు పక్కన కూర్చుని మింగించటం ఖాయం!. వళ్ళంతా తూట్లు బడేట్టు ఇంజక్షన్లు చేస్తూ హింసించటం తప్పదేమోరా భగవంతుడా?...

మహి తనకు సమీపంగ వచ్చి నిలబడితే చాలు డెలివరీ అయిన ఇంట్లో వదలని పురుటి కంపులాగ... ఆమె వద్ద ఆసుపత్రి మందుల వాసన! వాంతి వచ్చేట్టన్పిస్తుంది.

ఏమైనా అందామా అంటే... నోటి ప్లాస్టరో... వళ్లంతా బ్యాండేజో చుట్టేస్తుందేమోనే శంక!.

ఇలాంటి పెళ్లాన్ని ఇంకేం గోకాలన్పిస్తుంది? అదే వుద్యోగం చెయ్యని గృసి అయువుంటే.. గోకుడేం ఖర్మ... రోజూ బరుకుడే!. ఇంతకూ తనకు సుఖపడే యోగంలేదు. అలాంటప్పుడు నర్స్ భార్య వుత్సవిగ్రహంలాగ ఇంట్లో దేనికి ?...?

సంసారం విషయంలో రోజూ ఇద్దరికీ గొడవే!... వాదులాటే!... ఎవ్వరికీ సుకం వుండదు.

'మిమ్మల్ని చూస్తుంటే నాకేదో అవమానంగా వుంది. రేపు సెలవుపెట్టి మీరోసారి నావెంటరండి... అన్ని టెస్ట్‌లూ చేయిస్తాను.'

'నో నో నో! నీకలాంటి డౌటక్కర్లేదు. నేను పర్ఫెక్ట్ మిస్టర్ పర్ఫెక్ట్‌ని! నాలో ఏలోపమూ లేదు. ప్రాబ్లమంతా నీతోనే! నువ్వు జాబ్ మానేసి బెడ్‌కే పరిమితమైతే నా తఢాకా తెలుస్తుంది...'

'ఛీ! సిగ్గులేకుండా ఏమిటా మాటలు!'

'నువ్వు వుద్యోగం మానేసినా ఓ వారం ఫినాయిల్‌తో... మరో పదిరోజులు డెట్టాల్తో నిన్ను ముంచి స్నానం చేయిస్తేగాని... నీవంటిన వున్న ఆస్పత్రి కంపు వదల్దు! ఆ తర్వాతే ఏదైనా...'

'భర్త... సంసారం... పిల్లలు... జంజాటం కన్నా... నావృత్తే నాకు దైవం! అందులోనే ఎంతో తృప్తి! రోగుల సేవే నాకు పతిసేవకన్నా పవిత్రమైనది. భర్త... ఉద్యోగం... ఈ రెండింటిలో నాకేది కావాలని అడిగితే జాబ్‌కే నా ప్రిఫరెన్స్! అదే నా లైఫ్ అంటాను. మనం డైవర్స్ కోసం కోర్టునే ఆశ్రయించనక్కర్లేదు. ఇష్టపడి పత్రం రాసుకుని ఇరువురం సంతకాలు చేస్తే చాలు! మీదారి మీది... నాదారి నాది! కట్నం తాలూకు ఐదు లక్షలూ నాకు తిరిగి ఇచ్చేయండి. దటాశ్జిల్!!' తేల్చిచెప్పేసింది మహి.

ఇందరిని అతి సునాయాసంగ గోకిన తాను మహిని గోకలేకపోయినందుకు బాధపడ్డాడు లోకేశ్వర్రావ్. పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు. తలగోడకేసి బాదుకున్నాడు.

ఏం చేయాలో తోచని అయోమయంలో పడ్డాడు. లో (గో) కేశ్వర్రావ్!!-

---సమాప్తం---